సాక్షి

అనంతపురం

సోమవారం । 15 । జులై । 2024



జోరుగా నారు పెంపకం

తుంగభద్ర ఎగువ కాలువ పరిధిలోని ఆయకట్టు భూముల్లో ముందస్తు నార్ల పెంపకం ఊపందుకుంది. 8లో



వైభవంగా జగన్నాథుని మహాభిషేకం

బలరామ, సుభద్ర సమేత జగన్నాథుల ప్రతిమలకు పూజలు, అభిషేకం, మహానైవేద్య సమర్పణ ఘనంగా నిర్వహించారు. 8లో

గరిష్టం/కనిష్టం

32.3°/23.7°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

వేగంగా మాయమవుతూ..

- వర్షాకాలమైనా పెరగని భూగర్భజలాలు
- జిల్లాలో తాజా నగటు నీటిమట్టం 13.14 మీటర్లుగా నమోదు
- పుట్లూరు మండలంలో గరిష్టంగా 24.78 మీటర్లకు పతనం
- ఇదే పరిస్థితి కొనసాగితే ఉద్యాన పంటలపై తీవ్ర ప్రభావం
- పలు మండలాల్లో నీటి కష్టాలు ప్రారంభం



పుట్లూరులో ట్యాంకర్లతో తాగు నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: పేరుకు వర్షాకాలమైనా భూగర్భజలాలు పెరగడం లేదు. మరో రెండు మూడు నెలలు ఇలాగే కొనసాగితే ముమ్ముందు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని భూగర్భజలశాఖ అధికారులు విశ్లేషిస్తున్నారు. వాన నీరు ఎక్కడికక్కడ ఇంకేలా చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. ప్రధానంగా వ్యవసాయ, ఉద్యాన పంటలకు విరివిగా డ్రిప్, స్ప్రింక్లర్లు వాడటం, చెక్ డ్యాంలు, పర్క్యులేషన్ ట్యాంకులు, నీటి కుంటలు లాంటివి పెద్ద ఎత్తున నిర్మాణం చేపట్టడం, వరి లాంటి అధికంగా నీరు అవసరమయ్యే పంటలు కాకుండా తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారిస్తే సమస్య నుంచి గట్టెక్క డానికి అవకాశముంటుందని చెబుతున్నారు.

13.14 మీటర్లుగా నమోదు..

జూన్ మొదటి 15 రోజుల్లో 145 మి.మీ మేర కురిసిన వర్షాలకు ప్రస్తుతం నీటిమట్టం స్థిరంగానే ఉంది. భూగర్భజలశాఖ 97 పిజోమీటర్ల నుంచి తాజాగా సేకరించిన గణాంకాల ప్రకారం జిల్లా సగటు నీటి మట్టం 13.14 మీటర్లుగా నమోదైంది. పుట్లూరు మండలంలో గరిష్టంగా 24.78 మీటర్లకు భూగర్భ జలాలు పతనమైనట్లు వెల్లడైంది. 15 మీటర్లు దాటితే సమస్యలు ఉత్పన్నమవుతాయి. వర్షాకాలం లో భూగర్భ జల మట్టం గణనీయంగా పెరిగితేనే వచ్చే వేసవి నాటికి గండం నుంచి గట్టెక్కే అవకాశం ఉంటుందని గత అనుభవాలు చెబుతున్నాయి. గతేడాది ఇదే సమయానికి సగటు నీటిమట్టం 8.22 మీటర్లుగా నమోదైంది. గతేడాదితో పోల్చితే నేడు 4.92 మీటర్లు తగ్గడం గమనార్హం. ప్రస్తుతం 11 మండలాల్లో నీటి వినియోగం అధికంగా ఉండటంతో తగ్గుదల నమోదవుతోంది. ఈ మండలాల్లో 15 మీటర్లకు పైబడి లోతులో నీటి మట్టం రికార్డయింది. కేవలం ఒక మండలంలో మాత్రమే 3 మీటర్ల లోపు ఉండగా.. 9 మండలాల్లో 8 మీటర్ల లోపు, 10 మండలాల్లో 15 మీటర్ల లోపు భూగర్భజలాలు ఉన్నాయి. బెళుగుప్ప, బ్రహ్మసముద్రం,డీ హీరేహాళ్, గుమ్మఘట్ట, కళ్యాణదుర్గం, కణేకల్లు, కుందుర్పి, పుట్లూరు, రాయదుర్గం, శెట్టూరు, యాడికి మండలాల్లో నీటి వాడకం అధికంగా ఉన్నట్లు చెబుతున్నారు. ఇదే పరిస్థితి నెల రోజులు కొనసాగితే బొమ్మనహాళ్, గుత్తి, కంబదూరు, పామిడి, నార్పల, తాడిపత్రి, యల్లనూరు మండలాల్లో కూడా బాగా తగ్గిపోయే పరిస్థితి ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. దీంతో చీనీతో పాటు ఇతర ఉద్యాన పంటలకు ఇబ్బందిగా మారడం ఖాయం. ఇప్పటికే పలు మండలాల్లో తాగు నీటి ఇబ్బందులు నెలకొనడం గమనార్హం.

గత ఐదేళ్లలో సమృద్ధిగా తాగు, సాగునీరు..

గత ఐదేళ్ల కాలంలో విస్తారంగా వర్షాలు పడటంతో జిల్లా అంతటా సమృద్ధిగా తాగు, సాగునీరు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. ప్రధానంగా 2021, 2022లో కుండపోత వర్షాలు పడటంతో దశాబ్దాలుగా ఒట్టిపోయిన పెద్ద పెద్ద చెరువులు, నదీ పరివాహక ప్రాంతాలు సైతం జలసిరిని సంతరించుకున్నాయి. 2018లో భూగర్భజలాలు 25 మీటర్లుగా నమోదు కాగా 2019 అక్టోబర్ నాటికి 20 మీటర్లకు చేరుకున్నాయి. 2021, 2022లో అయితే సగటు నీటి మట్టం గతంలో ఎన్నడూ లేని విధంగా 6 నుంచి 7 మీటర్లకు చేరింది. పలు చోట్ల మోటార్లు లేకుండానే ఎండిపోయిన బోరుబావుల నుంచి నీళ్లు పైకి వచ్చాయి. అయితే, 2023–24 వర్షపు ఏడాదిలో వానల్లేక క్రమంగా నీటిమట్టం తగ్గుతూ ప్రస్తుతం సగటున 13.14 మీటర్లకు చేరుకుంది. నైరుతి రుతుపవనాలు, అల్పపీడనాల ప్రభావంతో కురిసే వర్షాలపై భవిష్యత్తు ఆధారపడి ఉందని భూగర్భ జల శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.



పుట్లూరు సమీపంలో ఇటీవల 1,000 అడుగులు తవ్వినా నీరు పడని దృశ్యం

ప్రస్తుతానికి ఇబ్బంది లేదు



భూగర్భ జలాలతో ప్రస్తుతానికి ఇబ్బందికర పరిస్థితి లేదు. జూలై నుంచి అక్టోబర్ వరకూ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నీటిమట్టం పెరగవచ్చు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఉపాధి హామీ పథకం ద్వారా విరివిగా ఫారం పాండ్లు, నీటి కుంటల నిర్మాణానికి సిఫార్సు చేస్తున్నాం. నీరు అధికంగా అవసరమయ్యే పంటల సాగును తగ్గించాలని కోరుతున్నాం. భూగర్భ జలాల వినియోగం అధికంగా ఉన్న ప్రాంతాలను ఎప్పటికప్పుడు గుర్తించి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– తిప్పేస్వామి, డీడీ, భూగర్భజలశాఖ

న్యూస్‌రీల్

టీబీ డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో తగ్గిపోయింది. ఈ నెల 7న 50,715 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో.. ఆదివారం నాటికి 12,194 క్యూసెక్కులకు పడిపోయింది. ప్రస్తుతం జలాశయంలో 105.788 టీఎంసీల పూర్తి మట్టానికి 31.709 టీఎంసీల నీరు ఉన్నాయి. అవుట్‌ఫ్లో 203 క్యూసెక్కులు నమోదవుతోంది. 1,633 అడుగుల డ్యాం ఎత్తుకు 1,606.81 అడుగుల వరకూ నీరు చేరాయి. జలాశయానికి ఎగువన శివమొగ్గ, శృంగేరి, తీర్థనహళ్లి, ఆగుంబే తదితర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో వరద నీరు వచ్చి చేరుతోంది. గతేడాది ఇదే సమయానికి 1,586.40 అడుగులతో డ్యాంలో 8.278 టీఎంసీల నీరు ఉండింది. 9,582 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 149 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది.

సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ బదిలీ



అనంతపురం రూరల్: సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్‌రావు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయనను కలెక్టర్ వినోద్‌కుమార్ రిలీవ్ చేశారు. బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారిని సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించారు.

నేటి నుంచి సీనియర్ మహిళా క్రికెట్ టోర్నీ



ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సీనియర్ మహిళా అంతర జోన్ క్రికెట్ టోర్నీ ప్రారంభం కానుంది. మొత్తం ఆరు జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీ ఈ నెల 25న ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే కృష్ణ, విశాఖపట్నం, చిత్తూరు, రెస్ట్ ఆఫ్ సౌత్, సెంట్రల్, నార్త్ జోన్ జట్లు అనంత క్రీడాగ్రామానికి చేరుకున్నాయన్నారు. సౌత్‌జోన్ జట్టులో అనంతపురానికి చెందిన పల్లవి, బిందుమాధవి, మనీష ప్రాతినిథ్యం వహిస్తున్నారన్నారు. కాగా, సోమవారం తొలి రోజు చిత్తూరు వర్సెస్ రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్, విశాఖ వర్సెస్ రెస్ట్ ఆఫ్ నార్త్, కృష్ణా వర్సెస్ రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జట్లు తలపడనున్నాయి.

తప్పిపోయిన అరగంటకే తల్లిదండ్రుల వద్దకు



తండ్రి వద్దకు చేరిన చిన్నారి సహస్ర

పెద్దవడుగూరు: తప్పిపోయిన అరగంటకే చిన్నారి ఆచూకీని గుర్తించి తల్లిదండ్రుల వద్దకు పోలీసులు చేర్చారు. వివరాలు.... శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం కోనాపురం గ్రామానికి చెందిన నాగరాజు, లక్ష్మీరమణమ్మ దంపతులు తమ కుమార్తె సహస్రతో కలసి అనంతపురంలో నివాసముంటున్నారు. ఆదివారం కుటుంబసభ్యులతో కలసి పెద్దవడుగూరులోని బంధువుల ఇంటికి నాగరాజు వచ్చారు. సాయంత్రం 5 గంటల సమయంలో ఇంట్లో అందరూ సరదాగా మాట్లాడుకుంటుండగా సహస్ర ఇంటి బయట ఆడుకుంటూ ప్రధాన రహదారిపైకి చేరుకుంది. తిరిగి ఇంటికి ఎలా వెళ్లాలో తెలియక రోడ్డుపై ఏడుస్తుంటే గుర్తించిన స్థానికులు వివరాలు ఆరా తీసేందుకు ప్రయత్నించారు. అయితే పెద్దవడుగూరులోని బంధువుల పేర్లు చెప్పలేకపోవడంతో బాలికను వెంటనే పోలీసులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సోషల్ మీడియాలో బాలిక ఫొటో, వివరాలు నమోదు చేసి అప్‌లోడ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న తండ్రి అరగంటలోనే పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సహస్రను అక్కున చేర్చుకున్నాడు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



మొక్క నాటి నీళ్లు పోస్తున్న జిల్లా పరిషత్ సీఈఓ వైఖోమ్ నిదియా దేవి

- జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా దేవి

రాప్తాడు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ వైఖోమ్ నిదియా దేవి అన్నారు. మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిస్తూ '100 రోజులు, 100 పట్టణాలు, 100 కార్యక్రమాలు' అనే థీమ్‌తో సాగుతున్న ఎంఎస్‌ఎంఈ, స్టార్టప్ బస్సు యాత్ర ఆదివారం మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక గొందిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని ఎంఎస్‌ఎంఈ పార్కు వద్ద ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సువన సోని, రాప్తాడు ఎంఎస్‌ఎంఈ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రాఘవేంద్ర సమక్షంలో 1,200 మొక్కలు నాటారు. కార్యక్రమానికి హాజరైన సీఈఓ మాట్లాడుతూ చెట్లను సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. కాలుష్య నివారణ అందరి కర్తవ్యం కావాలన్నారు. చెట్లను విచ్చల విడిగా నరికివేయడం వల్ల కాలుష్యం పెరిగిపోతోందన్నారు. జీవకోటి మనుగడ ప్రశ్నార్థకమవుతోందన్నారు. మొక్కలను విరివిగా నాటి ప్రతి గ్రామాన్ని ఒక ఉద్యాన వనంగా చేయాలని కోరారు. మొక్కలు నాటి పెంచడం అనేది ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. మొక్కలను పరిరక్షించుకోకపోతే మానవ మనుగడే ఉండదని ఆమె హెచ్చరించారు. సృష్టిలోని జీవరాశులన్నింటికీ మొక్కలే ఆధారమన్నారు. విచ్చలవిడిగా అడవుల నరికివేతతో ఇప్పటికే ఎన్నో రకాల అరుదైన మొక్కలు అంతరించిపోయాయన్నారు. అనంతరం మొక్కలను సంరక్షించాలంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టమాట తగ్గేదే లే..

- మార్కెట్‌లో కిలో టమాట రూ. 50
- రైతులకు గిట్టుబాటు.. వినియోగదారులకు ధరలపోటు
- వేసవిలో పంట సాగు విస్తీర్ణం తగ్గడమే ప్రధాన కారణం





టమాటకు ఆశించిన కాయ, కాండం మచ్చతెగులు



గోరంట్ల మండలం మల్లాపల్లిలో టమాటను పరిశీలిస్తున్న డీహెచ్ఓ జి.చంద్రశేఖర్

అనంతపురం అగ్రికల్చర్: టమాట తగ్గనంటోంది. అనంతపురంలోని కక్కలపల్లి మార్కెట్‌లో 15 రోజులుగా కిలో రూ.30 నుంచి రూ.48 వరకు పలికిన టమాట... ఆదివారం ఏకంగా రూ.50 మార్క్‌కు చేరుకుంది. పంట పండించిన రైతులకు ప్రస్తుతం మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభిస్తుండగా, వినియోగదారులకు ధరల పోటు తగులుతోంది. ఆగస్టు రెండో వారం వరకూ ఇదే పరిస్థితి ఉంటుందని, ఆ తర్వాత ధరలు తగ్గుముఖం పట్టి సాధారణ స్థాయికి చేరుకుంటాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

వేసవిలో సాగు తగ్గడమే కారణం..

ఏటా వేసవిలో టమాట సాగు తగ్గుతోంది. అధిక ఉష్ణోగ్రతలు, నీటి కొరత, వేడికి దిగుబడులు రాకపోవడం వంటి కారణాలతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో టమాట సాగు తగ్గిస్తారు. ఈ సారి వేసవితాపం 45 డిగ్రీల వరకు చేరుకోవడంతో సాగు పూర్తిగా తగ్గిపోయింది. తాపం తగ్గిన తర్వాత సాగు ప్రారంభించారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6,500 ఎకరాల్లో పంట సాగులో ఉన్నట్లు రెండు జిల్లాల ఉద్యానశాఖ అధికారులు జి.చంద్రశేఖర్, జి.ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. ఏటా ఖరీఫ్, రబీ, వేసవి మూడు సీజన్ల కింద జిల్లా వ్యాప్తంగా 40 వేల ఎకరాల వరకు టమాట వేస్తారు. ఎకరాకు సగటున 15 టన్నుల వరకు దిగుబడితో 6 లక్షల టన్నుల దిగుబడి వస్తోంది. టమాట ద్వారా జిల్లాలో ఏటా రూ.400 కోట్ల నుంచి రూ.500 కోట్ల టర్నోవర్ జరుగుతోందని ఉద్యానశాఖ నివేదిక చెబుతోంది.

ఇతర ప్రాంతాల నుంచి..

ప్రస్తుతం జిల్లాలో పండించిన టమాట మార్కెట్‌కు చాలా తక్కువగా వస్తోంది. వేసవి తగ్గిన తర్వాత సాగు చేసినందున ఆగస్టు నుంచి పంట కోతలు ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం చిత్తూరు, అన్నమయ్య జిల్లాలతో పాటు కర్ణాటక ప్రాంతం బాగేపల్లి, చింతామణి, కోలార్, ములబాగిలు తదితర ప్రాంతాల నుంచి టమాట మార్కెట్‌కు వస్తోంది. ఎండాకాలంలో టమాట సాగు తక్కువగా ఉన్నందున దేశ వ్యాప్తంగా చాలా రాష్ట్రాలు, ప్రాంతాల్లో ధరలు పెరుగుతున్నాయని అంచనా వేస్తున్నారు. గతేడాది ఇదే సమయంలో అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో కిలో టమాట ధర రూ.100 నుంచి రూ.150 వరకు పలకడం గమనార్హం.

సస్యరక్షణ చర్యలతో మేలు..

ఉమ్మడి జిల్లాలో తనకల్లు, నల్లచెరువు, అమడగూరు, కదిరి, కళ్యాణదుర్గం, ఆత్మకూరు, రాప్తాడు తదితర మండలాల్లో అధికంగా, మరో 20 మండలాల్లో మోస్తరుగా టమాట సాగు చేస్తున్నట్లు శ్రీ సత్యసాయి జిల్లా ఉద్యానశాఖ అధికారి జి. చంద్రశేఖర్ తెలిపారు. కాయదశలో ఉన్న టమాటకు మచ్చతెగులు, కాయతొలచు పురుగు, ఊజీ పురుగు ఆశించి నష్టం కలగజేసే పరిస్థితి ఉన్నందున రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కాయమచ్చ, కాండంమచ్చ తెగులు నివారణకు ఒక మి.లీ అజాక్సీస్ట్రోబిన్ + ఫలికర్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పిన్‌వామ్ (ఊజీ) నివారణకు 0.3 మి.లీ స్పైనోసాడ్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

జీజీహెచ్‌లో దొంగలు పడ్డారు



ఆస్పత్రిలోని దేవాలయ సమీపంలో ఈ నెల 4న అనస్తీషియా వైద్యుడి బైకు అపహరిస్తున్న అగంతకుడు



గత నెల 7న పెథాలజిస్టు బైకును దొంగిలించి తీసుకెళ్తున్న అగంతకుడు



గత నెల 28న వైద్య కళాశాలలోకి చొరబడిన దొంగ

- పలువురు వైద్యుల బైకులు మాయం
- వైద్య కళాశాలలో రూ.8 లక్షల విలువ చేసే సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ల చోరీ
- నిఘా కొరవడడం, ఔట్ పోస్టు పోలీసుల నిర్లక్ష్యంతోనే దొంగతనాలు!

అనంతపురం మెడికల్: స్థానిక సర్వజనాస్పత్రి ఆస్పత్రిలో దొంగలు రెచ్చిపోతున్నారు. రోగులు, డాక్టర్లు, సిబ్బంది విలువైన వస్తువులు చోరీ చేస్తూ హడలెత్తిస్తున్నారు. గడిచిన 30 రోజుల్లోనే ఆస్పత్రిలో పలువురు వైద్యులకు చెందిన రెండు బైకులు అపహరణకు గురయ్యాయి. పెథాలజిస్టు డాక్టర్ శ్రీనివాసులు, అనస్తీషియా వైద్యులు డాక్టర్ కేజీ శ్రీహరి ఆస్పత్రి ఆవరణలో పార్కింగ్ చేసిన బైకులను దొంగలు అపహరించుకెళ్లారు. విధులు ముగించుకుని వచ్చి చూసే సరికి బైకులు కన్పించకపోవడంతో విషయాన్ని సంబంధిత వైద్యులు రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్ల దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో సీసీ పుటేజీను పరిశీలించగా.. అందులో ఓ యువకుడు బైకులను అపహరించినట్లు కనిపించింది. గతంలో మెడిసిన్ వార్డులో ఓ అసోసియేట్ ప్రొఫెసర్‌కు చెందిన సెల్‌ఫోన్ కూడా చోరీకి గురైంది. ఆస్పత్రి సమీపంలోని ప్రభుత్వ వైద్య కళాశాలనూ దొంగలు వదలడం లేదు. గత నెల 28న అక్కడి మెన్స్ హాస్టల్‌లోకి డాక్టర్ల దుస్తుల్లో చొరబడి రూ.8 లక్షలు విలువ చేసే సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, సామగ్రి ఎత్తుకెళ్లారు.

నిర్లక్ష్యంతోనే..

ఉమ్మడి జిల్లా ప్రజలకు సర్వజనాస్పత్రి పెద్ద దిక్కు. వేల సంఖ్యలో ఇక్కడ సిబ్బంది పనిచేస్తున్నారు. రోజూ వందల సంఖ్యలో రోగులు చికిత్సలు పొందుతుంటారు. అలాంటి ఆస్పత్రిలో దొంగలు హల్‌చల్ చేస్తుండడం విస్మయానికి గురి చేస్తోంది. సీసీ కెమెరాలు పూర్తి స్థాయిలో పని చేయకపోవడం దొంగలకు వరంగా మారినట్లు తెలుస్తోంది. ఆస్పత్రిలో 160 కెమెరాలున్నా.. వాటి నిర్వహణకు ప్రత్యేకంగా సిబ్బంది అందుబాటులో లేక తరచూ మొరాయిస్తున్నాయి. ఇటీవల నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ ఆస్పత్రికి వచ్చినప్పుడు కూడా సీసీ కెమెరాలు పని చేయలేదు. దీనికితోడు ఔట్‌పోస్టు పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది బాధ్యతారాహిత్యం కూడా చోరులకు కలిసి వస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పార్కింగ్ ప్రాంతంలో నిఘా నిల్..

ఆస్పత్రిలో పార్కింగ్ సమస్య నెలకొనడం కూడా దొంగలకు మేలు చేస్తోంది. ఇటీవల అధికారులు ఆస్పత్రి ఆవరణలో వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకున్నారు. వెనుకవైపు, చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం పరిసర ప్రాంతాల్లో బైకులు పార్కు చేసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో రాత్రి వేళ విధులకు వచ్చే వైద్యులు, సిబ్బంది తమ వాహనాలు ఆ ప్రాంతంలో ఉంచుతున్నారు. అటు వైపు పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది నిఘా కొరవడడం దొంగలకు మంచి ఛాన్స్‌గా మారింది. సులువుగా తమ పని కానిచ్చేస్తున్నారు. గతంలో మాదిరిగా పార్కింగ్ ఉంటే సమస్య ఉండేది కాదని సిబ్బంది వాపోతున్నారు. ఆ ప్రాంతంలో గస్తీనైనా పెంచాలని కోరుతున్నారు. ఆస్పత్రి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

పోలీసులకు ఫిర్యాదు చేశాం

ఆస్పత్రిలో వైద్యుల బైకులు చోరీకి గురైన విషయం వాస్తవమే. దీనిపై టూటౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాం. సెక్యూరిటీ సిబ్బందిని అప్రమత్తం చేశాం. గతంలోనూ రెండు బైకులు చోరీకి గురయ్యాయి. సీసీ కెమెరాల ద్వారా పోలీసులు నిందితులను గుర్తించి బైకులు రికవరీ చేసి ఇచ్చారు. ఇంకా రెండు బైకులు రికవరీ కావాల్సి ఉంది. ఆస్పత్రిలో నిఘా పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్

ఇసుక కొల్లగొడుతున్నారు!



ఉద్దేహాళ్ సమీపంలోని వేదావతి హగరి నదిలో ఇసుకను తవ్వి ట్రాక్టర్లలో లోడ్ చేస్తున్న దృశ్యం



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

బొమ్మనహాళ్: మండలంలో టీడీపీ నేతలు ఇసుక దందా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఉద్దేహాళ్, కల్లువేవనహళ్లి, బండూరు, దర్గాహొన్నూరు, బొల్లనగుడ్డం, మైలాపురం, గోవిందవాడ గ్రామాల సమీపంలో వేదావతి హగరి నదిలో నాణ్యమైన ఇసుక అందుబాటులో ఉంది. కర్ణాటక ప్రాంతాల్లో దీనికి మంచి డిమాండ్ ఉండడంతో టీడీపీ నాయకుల కన్ను నదిపై పడింది. అధికారంలోకి వచ్చాక ఇసుక దందాకు తెరలేపారు. వేదావతి హగరి నది నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా ట్రాక్టర్ల సహాయంతో నేమకల్లు శివార్లలో ఉన్న కంకర క్వారీలు, జన సంచారం తక్కువగా ఉన్న వ్యవసాయ పొలాలు, కంపచెట్ల మధ్యకు ఇసుకను తరలిస్తున్నారు. అక్కడి నుంచి రాత్రికి రాత్రి జేసీబీల సహాయంతో టిప్పర్లలో నింపుకుని ఇసుకపై టార్పాలిన్ కప్పుకుని కర్ణాటకలోని బళ్లారి పట్టణానికి తరలిస్తున్నారు. ఒక లోడ్ రూ.40 వేలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన తెలుగు తమ్ముళ్లు వారానికి ఒకరు చొప్పున 5 నుంచి 10 టిప్పర్ల ఇసుకను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. అక్రమార్కులతో కొంతమంది కింది స్థాయి సిబ్బంది కుమ్మక్కయ్యారనే విమర్శలున్నాయి.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అనుమతి లేకుండా వేదావతి హగరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను గోవిందవాడ క్రాస్ వద్ద పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ నరేంద్రబాబు తెలిపారు. మండలంలోని ఉద్దేహాళ్ వేదావతి హగరి నది నుంచి శనివారం రాత్రి ఇసుకను తరలిస్తుండగా నేమకల్లు, దర్గాహొన్నూరు, దేవగిరి గ్రామాలకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు చాకలి హనుమంతు, ఆదిమూర్తి, బోయ శ్రీకాంత్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మూడు ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు.

75 శాతం రాయితీతో రైతులకు గడ్డి విత్తనాలు

అనంతపురం సెంట్రల్: పాడి రైతులకు 75 శాతం రాయితీతో గడ్డి విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వై. సుబ్రమణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు 55 మెట్రిక్ టన్నులు కేటాయించగా, వాటిని పశువుల ఆసుపత్రులకు సరఫరా చేసినట్లు వివరించారు. కిలో ధర రూ. 92 కాగా 75 శాతం రాయితీ పోనూ రైతు వాటా కింద రూ. 23 ప్రకారం చెల్లించాలని తెలిపారు. గడ్డి జొన్నలు కూడా అందుబాటులో ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

అనంత నాట్యాచార్యునికి అరుదైన గౌరవం



సన్మానం అనంతరం మాట్లాడుతున్న నాట్యాచార్యుడు కృష్ణమూర్తిరాజు

అనంతపురం కల్చరల్: లండన్ నగరంలోని కాటన్ గ్రోవ్స్ ప్రాంగణంలో తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సాంస్కృతిక ఉత్సవంలో అనంతపురానికి చెందిన కూచిపూడి నాట్యాచార్యుడు కృష్ణమూర్తిరాజును ప్రత్యేకంగా గౌరవించారు. ఈ సందర్భంగా 'సవ్యసాచి' పురస్కారాన్ని అందించి, ఆయన సేవలను ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ తోలేటి, సభ్యులు కొనియాడారు. అనంతరం భారతీయ నాట్యశాస్త్రంలోని విశేషాలను అక్కడి వారితో కృష్ణమూర్తిరాజు పంచుకున్నారు.

నేషనల్ పారా అథ్లెటిక్స్‌కు క్రీడాకారుల ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన అనంతపురం క్రీడాకారులు

అనంతపురం: ఈ నెల 16, 17వ తేదీల్లో బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో జరిగే నేషనల్ పారా అథ్లెటిక్స్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీలకు 10 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. గత నెల 30న విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పారా జూనియర్, సబ్ జూనియర్ -2024 పోటీల్లో జిల్లా తరపున 26 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. వీరిలో ప్రతిభ చాటిన 10 మందిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు తెలిపారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను వారు అభినందించారు. జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

క్రీడాకారుడు	ఈవెంట్
జి.రాధిక	400 మీటర్ల పరుగు
కె.వెంకటేష్	400 మీటర్ల పరుగు
ఎ.ప్రతాప్‌కుమార్ రెడ్డి	షాట్‌పుట్
బి.నాగేంద్ర	400 మీటర్ల పరుగు
సి.వినయ్‌దత్	400 మీటర్ల పరుగు
బి.తిలక్	షాట్‌పుట్
సుదర్శన్	షాట్‌పుట్
ఎ.భార్గవ్‌కుమార్	400 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, డిస్క్ త్రో
ఎ.నరేష్	400 పరుగు, లాంగ్ జంప్
సి.తరుణ్	400 పరుగు, లాంగ్ జంప్

ఊపిరి ఆగిపోతానంటోంది!

పేదరికం వెంటాడుతున్నా కుటుంబానికి పెద్ద దిక్కుగా మారింది. అంగన్‌వాడీ ఆయాగా పనిచేస్తూ ఆర్థిక కష్టాల నుంచి కుటుంబాన్ని గట్టెక్కించేందుకు తన శాయశక్తులా శ్రమించింది. బతుకు భారమైనా.. ఆ బాధల్ని భరిస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చింది. ఉన్న ఇద్దరు పిల్లలను ఉన్నత విద్యావంతులను చేయాలనే ఆకాంక్ష ముందు తనను కబళిస్తున్న అనారోగ్యాన్ని గుర్తించేలోపు పరిస్థితి చెయ్యి దాటింది. క్యాన్సర్ నాలుగో దశతో బాధపడుతూ ఆస్పత్రి పాలైంది. అడ్వాన్స్‌డ్ స్టేజ్‌లో ఉన్న మహమ్మారి శస్త్రచికిత్సకు రూ. 15లక్షలు అవసరమని వైద్యులు తెలపడంతో దిక్కుతోచని స్థితిలో నిరుపేద కుటుంబం కొట్టుమిట్టాడుతోంది. దాతలెవరైనా స్పందించి ప్రాణభిక్ష పెట్టాలని నిస్సహాయురాలైన ఆ తల్లి బిడ్డలు వేడుకుంటున్నారు.

- ప్రాణాపాయ స్థితిలో అంగన్‌వాడీ ఆయా
- క్యాన్సర్ అడ్వాన్స్‌డ్ స్టేజ్‌తో నెల్లూరు ఆస్పత్రిలో చేరిక
- పేదరికంతో మెరుగైన చికిత్సకు దూరం
- అమ్మను కాపాడుకునేందుకు చదువులు పక్కన పెట్టి హోటల్‌లో పనిచేస్తున్న కుమారుడు
- ప్రాణభిక్ష పెట్టాలంటూ వేడుకోలు



నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగమ్మ



ఆస్పత్రి ఖర్చుల కోసం హోటల్‌లో పనిచేస్తున్న కుమారుడు పవన్‌కుమార్

శెట్టూరు: మండలంలోని ఐదుకల్లు గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న నాగమ్మకు తీరని కష్టం వచ్చిపడింది. భర్త గోవిందప్ప, ఇద్దరు పిల్లలతో ఎంతో సంతోషంగా జీవిస్తున్న ఆమె క్యాన్సర్ బారిన పడి జీవన్మరణ పోరాటం సాగిస్తున్నారు. రూ.7 వేల గౌరవవేతనంతోనే గుట్టుగా కుటుంబాన్ని నెట్టుకొచ్చిన ఆమె తన కుమార్తె శ్వేతను టీటీసీ పూర్తి చేయించింది. ప్రస్తుతం శ్వేత డీఎస్సీ కోసం సన్నద్ధమవుతోంది. కుమారుడు పవన్‌కుమార్ ప్రస్తుతం డిప్లొమా చేస్తున్నాడు.

బిడ్డల చదువులే ముఖ్యమని..

పిల్లల చదువులు ఒక్కటే తమ కుటుంబాన్ని ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కిస్తాయని భావించిన నాగమ్మ తన దృష్టి మొత్తం వారి చదువులపైనే నిమగ్నం చేసింది. డీఎస్సీలో కుమార్తె టీచర్ ఉద్యోగానికి అర్హత సాధిస్తుందని, మరి కొన్ని నెలలకు కుమారుడు సైతం డిప్లొమా పూర్తి చేసుకుని ఏదో ఒక ఉద్యోగంలో స్థిరపడతాడని ఎంతో ఆశగా ఎదురుచూస్తోంది. ఈ క్రమంలో దగ్గొచ్చినా... జ్వరమొచ్చినా ఎవరితోనూ చెప్పుకోకుండా గుట్టుగా ఆస్పత్రికి వెళ్లి మందులు తీసుకుని వాడుతూ వచ్చింది. అయితే తనను మహమ్మారి కబళిస్తోందనే విషయాన్ని మాత్రం ఆమె గుర్తించలేకపోయింది. బిడ్డల ఉన్నతినే తన జీవితాశయంగా శ్రమిస్తున్న నాగమ్మ ఒక్కసారిగా నీరసపడుతూ వచ్చింది.

నాలుగు నెలల క్రితం...

నాలుగు నెలల క్రితం నాగమ్మ ఆరోగ్య పరిస్థితి ఒక్కసారిగా విషమించింది. తెరతెరలుగా కమ్ముకొచ్చిన దగ్గుతో ఊపిరి తీసుకోవడానికి సైతం తీవ్ర ఇబ్బంది పడుతూ ఆస్పత్రి మెట్లు ఎక్కింది. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని మెడికోవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు రెఫర్ చేశారు. అక్కడికెళ్లితే పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమె లంగ్ క్యాన్సర్‌తో బాధపడుతోందని నిర్ధారించారు. అది కూడా ఫోర్త్ స్టేజ్‌లో ఉన్నట్లుగా గుర్తించారు.

రూ.15 లక్షలు ఖర్చు..

తమ తల్లిని క్యాన్సర్ మహమ్మారి కబళిస్తోందని తెలియగానే కుమార్తె, కుమారుడి ఆవేదనకు అంతులేకుండా పోయింది. తమ చదువుల కోసం ఆమె పడిన కష్టాన్ని తలచుకుని కన్నీరు పెట్టారు. ఎలాగైనా అమ్మను కాపాడుకోవాలనే తపన వారిలో మొదలైంది. వైద్యులను కలసి తమ అమ్మను బతికించాలని వేడుకున్నారు. ఆలస్యం చేయకుండా శస్త్రచికిత్స చేయాలని, లేకపోతే మరణం తప్పదని వైద్యులు సూచించారు. చికిత్స కోసం రూ.15 లక్షల వరకూ ఖర్చు అవుతుందన్నారు. ఆ మేరకు డబ్బు సిద్ధం చేయాలన్నారు. అమ్మ సంపాదన అంతంత మాత్రమే. నాన్న కూలి పనికి వెళితే తప్ప కుటుంబం గడవదు. అరకొర సంపాదనతోనే కుమార్తెకు పెళ్లి చేసి అత్తింటికి పంపారు. ఇలాంటి స్థితిలో రూ.15 లక్షలు ఎక్కడి నుంచి తీసుకురావాలో పిల్లలకు దిక్కుతోచలేదు. విక్రయించేందుకు ఎలాంటి ఆస్తిపాస్తులూ లేవు. దీంతో కుమారుడు తన చదువును మధ్యలోనే ఆపేసి ఓ హోటల్‌లో కార్మికుడిగా చేరాడు. హోటల్ యాజమాని ఇచ్చే డబ్బు రోజువారీ ఆస్పత్రి ఖర్చులకే తక్కువ పడుతోంది. కారు మబ్బులు కమ్ముకుంటున్న జీవితం అంధకారమయమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో తమ అమ్మకు ప్రాణభిక్ష పెట్టాలంటూ పిల్లలు వేడుకుంటున్నారు.

సాయం చేయదలిస్తే...

పేరు	: పవన్‌కుమార్
బ్యాంక్	: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కళ్యాణదుర్గం శాఖ
ఖాతా నంబర్	: 4113 648 5871
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్	: ఎస్‌బీఐఎన్0001318
ఫోన్ పే నంబర్	: 86883 91443
సంప్రదించాల్సిన నంబర్	: 86883 91443

సర్పంచ్ ఆర్థిక సాయం

ఐదుకల్లు నుంచి నెల్లూరుకు వెళ్లిరావడం భారంగా మారడంతో కుటుంబం మొత్తం అన్నమయ్య జిల్లా రాజంపేటకు మకాం మార్చారు. అక్కడే ఓ హోటల్‌లో కుమారుడు రోజుకు రూ.600 చొప్పున దినసరి వేతనం కింద పని చేస్తున్నాడు. ఈ క్రమంలో నాగమ్మ పరిస్థితి తెలుసుకున్న ఐదుకల్లు గ్రామ సర్పంచ్ విరూపాక్షిగౌడ్ చలించిపోయారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తన వంతు సాయంగా రూ.20 వేలను అందజేశారు. చికిత్స కోసం మరింత సహకారం అందిస్తానని, ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ విరుపాక్షిగౌడ్

జూనియర్ కళాశాల్లో మధ్యాహ్న భోజనం ప్రారంభించాలి

- భారత విద్యార్థి ఫెడరేషన్



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించాలని ప్రభుత్వాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురంలోని గణేనాయక్ భవన్‌లో ఎస్‌ఎఫ్‌ఐ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఆగస్ట్ 6,7 తేదీల్లో ఉరవకొండలో జరిగే ఎస్‌ఎఫ్‌ఐ 32వ జిల్లా ప్లీనరీ సమావేశాలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఓతూరు పరమేష్, శివ, జిల్లా ఉపాధ్యక్షులు వైటీసీ రమేష్, రజిత మాట్లాడారు. కరువుకు నిలయంగా ఉన్న అనంతపురం జిల్లాలో విద్యారంగ సమస్యలు పుట్టగొడుగుల్లా పుట్టుకు వస్తున్నాయన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు సాగించేలా ప్లీనరీ సమావేశాల్లో కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. జూనియర్ కళాశాల విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, సిద్ధు, గిరి, సహాయ కార్యదర్శులు సూర్య, వెంకీ, శివ, భీమేష్ పాల్గొన్నారు.

ముగిసిన పశుగ్రాస వారోత్సవాలు

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి చేపట్టిన పశుగ్రాస వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. రైతుసేవా కేంద్రాలు, పశువుల ఆస్పత్రుల్లో ఆ శాఖ జేడీ నుంచి డీడీ, ఏడీలు, పశువైద్యులు, ఇతర పారా సిబ్బంది ఆధ్వర్యంలో పశుగ్రాసం ప్రాధాన్యతపై వారం రోజుల పాటు రైతులను చైతన్య పరిచారు. ఈ సందర్భంగా ఆ శాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం 'సాక్షి'తో మాట్లాడుతూ.. పశుపోషణ, పాడి అభివృద్ధిలో పశుగ్రాసం ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. ఎండు, పచ్చిగడ్డి ద్వారా పోషక విలువలు కలిగిన మేతను పశువులకు ఇవ్వడం ద్వారా సంతతి ఉత్పత్తితో పాటు పాల దిగుబడి పెరిగిందన్నారు. రకరకాల గడ్డి జాతులు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రతి రైతూ అంతో ఇంతో గడ్డి పెంపకం చేపట్టాల్సిన అవసరాలపై అవగాహన కల్పించామన్నారు.

అక్కాచెల్లెమ్మలకు వంచన

- 'తల్లికి వందనం' పేరుతో మోసం
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే విశ్వ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట తప్పడంలో సీఎం చంద్రబాబును మించిన వారు ఈ ప్రపంచంలో ఎక్కడేగాని లేరని, తల్లికి వందనం పేరుతో అక్కాచెల్లెమ్మలను వంచనకు గురిచేశారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. ఉరవకొండలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంత మందికి రూ.15వేలు చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు ఆర్భాటంగా హామీనిచ్చిన కూటమి నేతలు... అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చి దగా చేస్తున్నారన్నారు. చంద్రబాబు గొప్పగా చెప్పుకున్న సూపర్ సిక్స్‌లో కూడా ఈ పథకాన్ని చూపారన్నారు. నేడు ఆ సూపర్ సిక్స్ ప్రస్తావనే లేకుండా పోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేయనున్న పథకాలన్నీ ఆధార్‌కు అనుసంధానం చేస్తూ ఒక్కో పథకానికి ఓ కుటుంబం మాత్రమే అర్హత పొందేలా కుట్ర సాగుతోందన్నారు.

సుప్రీం తప్పు పట్టినా జగన్‌పై అక్రమ కేసు

అప్పటి ఎంపీ రఘురామకృష్ణరాజు ఫిర్యాదులో వాస్తవం లేదని 77 రోజుల తర్వాత సాక్షులను విచారణకు తీసుకోవడం సరికాదని సాక్షాత్తూ సుప్రీం కోర్టే ఆ రోజు స్పష్టం చేసిందని విశ్వ గుర్తు చేశారు. సుప్రీం సూచనలను పరిగణనలోకి తీసుకోకుండా మూడేళ్ల తర్వాత నేడు వైఎస్ జగన్, సీనియర్ ఐపీఎస్‌లపై చంద్రబాబు ప్రభుత్వం కేసు నమోదు చేయడం సిగ్గు చేటన్నారు. కేవలం దురుద్దేశం, రాజకీయ కక్షతోనే ఈ కేసు బనాయించారన్నారు. దీని ద్వారా రాష్ట్రంలో పోలీసులు కొత్త సంప్రదాయానికి తెరతీశారని, ఇది భవిష్యత్తులో వారికే ఇబ్బందిగా మారుతుందన్నారు.

జోరుగా నారు పెంపకం

- మిరప, వరి విత్తనాలకు పెరిగిన డిమాండ్
- బోర్ల కింద ముందస్తుగా నారు అభివృద్ధి



లింగదహాళ్‌లో బోర్ల కింద పెరుగుతున్న వరి నారు

బొమ్మనహాళ్: తుంగభద్ర ఎగువ కాలువ పరిధిలోని ఆయకట్టు భూముల్లో ముందస్తు నార్ల పెంపకం ఊపందుకుంది. కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం నుంచి ఈ నెల చివరి వారంలో హెచ్చెల్సీకి నీరు విడుదల చేస్తామని అధికారులు చెప్పడంతో రైతులు వ్యవసాయ బోర్ల కింద నార్ల పెంపకం చేపట్టారు. ప్రస్తుతం మార్కెట్‌లో పత్తి, మిరప, మొక్కజొన్న, వేరుశనగ కాయలకు మంచి డిమాండ్ ఉంది. ఈ క్రమంలో అన్నదాతలు విత్తనాల సేకరణకు నానా ఇబ్బందులు పడుతున్నారు. రైతుల డిమాండ్‌తో విత్తనాల ధర పెరిగింది. ఈ క్రమంలో దేవగిరి క్రాస్, దేవగిరి, బెంచికొట్టాల, కణేకల్లు క్రాస్, ఉంతకల్లు గ్రామాల్లో నర్సరీలు, పొలాల్లో బోర్ల కింద ముందస్తుగా మిరప నార్ల పెంపకం జోరుగా సాగుతోంది. బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్ , బళ్లారి జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు నార్లు పోసుకునేందుకు పోటీపడుతున్నారు.

పెరుగుతున్న విత్తన ధరలు..

మార్కెట్‌లో రైతుల అవసరాలను ఆసరా చేసుకుని వ్యాపారులు విత్తన ధరలను అమాంతం పెంచేస్తున్నారు. ప్రస్తుతం వివిధ కంపెనీల మిరప విత్తనాలు కిలో రూ. 25 వేల నుంచి రూ.లక్ష వరకూ ధర పలుకుతున్నాయి. పలువురు రైతులు కర్ణాటకలోని బ్యాడిగకు వెళ్లి కిలో రూ.800 చొప్పున బ్యాడిగ మిర్చి కొనుగోలు చేసి విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు. అలాగే మరికొందరు రైతులు విడపనకల్లు మండలం వేల్పుమడుగు, ఆర్ కొట్టాల గ్రామాల్లో రైతుల వద్ద నుంచి బ్యాడిగ, డీలెక్స్, డబ్బీ కాయ విత్తనాలకు సంబంధించి కిలో మిర్చిని రూ. 600 నుంచి రూ. 800 వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో హెచ్చెల్సీ కింద వరి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉన్నందున ఆయా ప్రాంతాల్లో వరి విత్తనాలకు డిమాండ్ భారీగా పెరిగింది. బీపీటీ సోనా, ఎస్‌ఎల్‌ఆర్, ఆర్‌ఎన్‌ఆర్ రకాలకు చెందిన వరి పంటను ఈ ప్రాంతాల్లో ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి రైతులు ఎక్కువగా కర్ణాటకలోని కంప్లి వద్ద ఉన్న వసికేరి క్యాంప్ నుంచి వరి విత్తనాలను సేకరించుకుంటున్నారు. ప్రస్తుతం 30 కిలోల వరి విత్తనం రూ. 1,350 ధర పలుకుతోంది. ఇక స్థానికంగా రైతులు పండించిన విత్తనమైతే 70 కిలోల బీపీటీ సోనా రూ. 3,100, ఎల్‌ఎల్‌ఆర్, ఆర్‌ఎన్‌ఆర్ విత్తనాలు రూ. 3,700 వరకూ విక్రయిస్తున్నారు. పత్తికి సంబంధించి 450 గ్రాముల విత్తన ప్యాకెట్ రూ. 800 నుంచి రూ. వెయ్యి వరకు ధర పలుకుతోంది. మొక్కజొన్న విత్తనాలు సైతం నాలుగు కిలోల ప్యాకెట్ రూ.1,500 నుంచి రూ. 1,800 వరకు విక్రయిస్తున్నారు. రైతులకు ఇచ్చే రాయితీ విత్తనాలను ప్రభుత్వం సక్రమంగా పంపిణీ చేయకపోవడంతో రైతులు బహిరంగ మార్కెట్ వైపు దృష్టి సారిస్తున్నారు. మార్కెట్‌లో క్వింటా వేరుశనగ విత్తనాలు రూ. 6,700 వరకు ధర పలుకుతోంది.

సెంటు స్థలం అద్దె రూ.500..

బోర్లు లేని రైతులు బోర్లు ఉన్న రైతుల వద్ద ముందస్తు నార్లు పెంచుకునేందుకు స్థలం, నీటి కోసం సెంటుకు రూ. 500 చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. ముందస్తుగా వరి నార్లు పెంచుకుంటే రైతులకు 40 రోజుల నీరు ఆదా కానుంది. హెచ్చెల్సీ ఆయకట్టుకు నీరు విడుదల కాగానే వరి, మిరప సాగుకు ఈ నార్లు ఎంతో దోహదపడనున్నాయి. అయితే విత్తనాలు కొనుగోలు సమయంలో రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని, లేకపోతే మోసపోయే ప్రమాదముందని వ్యవసాయాధికారి సాయికుమార్ హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వగుర్తింపు పొందిన డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. అన్ని వివరాలతో కూడిన రసీదునూ పొందాలన్నారు.

మోసగించిన ప్రభుత్వం

- నెల రోజుల వ్యవధిలోనే ఉద్యోగులను దగా చేసిన కూటమి సర్కారు
- యూటీఎఫ్ ఆధ్వర్యంలో జీపీఎస్ గెజిట్ ప్రతుల దగ్ధం



జీపీఎస్ గెజిట్ ప్రతులను దహనం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: అధికారం చేపట్టిన కేవలం నెల రోజుల్లోనే కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసగించిందని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు మండిపడ్డారు. యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఆదివారం జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక టవర్‌క్లాక్ వద్ద 'జీపీఎస్ గెజిట్' ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి. కోటేశ్వరప్ప మాట్లాడారు. సీపీఎస్ స్థానంలో గత ప్రభుత్వం జీపీఎస్‌ను అమలు చేస్తూ జీఓ 54 విడుదల చేసిందన్నారు. ఈ జీఓ అమలు కాకుండా అనేక పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. దీనికి కొనసాగింపుగా ఉద్యోగుల హక్కులను కాలరాస్తూ కూటమి ప్రభుత్వం సైతం జీపీఎస్ గెజిట్‌ను విడుదల చేయడం సిగ్గుచేటన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి. గోవిందరాజులు మాట్లాడుతూ... టీడీపీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని నెరవేర్చడంలో భాగంగా పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పథకాన్ని కేవలం ప్రభుత్వ బడులలో చదివే విద్యార్థులకు మాత్రమే అమలు చేయాలన్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్‌వీపీ రమణయ్య, సీఐటీయూ నాయకులు నాగేంద్ర, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ఉద్యోగులు, ఉపాధ్యాయులను చంద్రబాబు ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ భవిష్యత్తులో జరిగే అన్ని పోరాట కార్యక్రమాలలో పాల్గొంటామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సంజీవ్‌కుమార్, కె.నాగేంద్ర, చిత్తప్ప, గంగాధర్, వెంకట్ నాయుడు, రాజ కుళ్లాయప్ప, సీతారాం రెడ్డి, రాజేంద్ర, హెన్రీ మార్క్, ఉమాపతి, వెంకటరాముడు, మహబూబ్ బాషా, నాగభూషణ, జిలాన్, జాకీర్ హుస్సేన్, పవన్ కుమార్, గౌస్ పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథుని మహాభిషేకం



ముగింపు వేడుకలకు హాజరైన భక్తులు



హారతి ఇస్తున్న రేవతి రమణదాసు ప్రభు

- హరేకృష్ణ నామస్మరణతో పులకించిన భక్తులు

అనంతపురం కల్చరల్: రెండు రోజులుగా అనంతపురంలో సందడిగా సాగిన పూరీ జగన్నాథ రథోత్సవ వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. లలితకళాపరిషత్తు ప్రాంగణం హరే కృష్ణ నామస్మరణతో మార్మోగింది. బలరామ, సుభద్ర సమేత జగన్నాథుల ప్రతిమలకు విశేష పూజలు, అభిషేకం, మహానైవేద్య సమర్పణ తదితర సేవలను ఘనంగా నిర్వహించారు. దర్బార్ సేవలతో పాటూ దేవతామూర్తుల ప్రతిమలకు 108 మంది జంటలతో సామూహిక పూజలు జరిపించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇస్కాన్ జీబీసీ చైర్మన్ రేవతీ రమణదాసు తమ ప్రవచనంలో జగన్నాథ రథోత్సవ వైభవాన్ని వివరించారు. మహాపుష్పార్చన, మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. ప్రముఖ ప్రవచనకర్త రాధామనోహరదాసు, ఇస్కాన్ జిల్లా ఇన్‌చార్జి దామోదర గౌరంగదాసు, టీటీడీ ధార్మిక ప్రచార మండలి అధ్యక్షుడు శ్రీపాద వేణు, టౌన్ డీఎస్పీ సతీష్‌కుమార్, ఇస్కాన్ పీఆర్‌ఓ రఘునాథకుమార్‌రెడ్డి, గోశాల నిర్వాహకులు సుధీర్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొని ఒకరి మృతి



మృతుడు శేఖర్

యాడికి: లారీని ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు గ్రామానికి చెందిన శేఖర్ (35), మల్లికార్జున ఆదివారం ఉదయం యాడికిలోని మోడల్ స్కూల్ సమీపంలో కంకర చదును చేసే పనులకు వచ్చారు. పనిముగించుకుని రాత్రి 9 గంటలకు స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. రాయలచెరువు దాటగానే వర్షం మొదలైంది. అదే సమయంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆగి ఉన్న లారీని గుర్తించక వెనుక నుంచి ఢీకొన్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక శేఖర్ మృతి చెందాడు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మల్లికార్జునను అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

'రెడ్డి వివాహ పరిచయ వేదిక' విజయవంతం



వివాహ పరిచయ వేదికకు హాజరైన రెడ్డి కులస్తులు

రాప్తాడురూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'రెడ్డి వివాహ పరిచయ వేదిక' విజయవంతమైంది. అనంతపురం రూరల్ పాపంపేటలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన వివాహ పరిచయ వేదికకు జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి దాదాపు 80 మంది దాకా హాజరయ్యారు. వధువు, వరుడి వివరాలు, ఫొటోలు పరిశీలించారు. ప్రతినెలా రెండో ఆదివారం ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, రెడ్డి జన సంఘం వ్యవస్థాపకుడు రొద్దం సురేష్ రెడ్డి, సెక్రటరీ దుబ్బ కిషోర్ రెడ్డి, ట్రెజరర్ తోపుదుర్తి రామకృష్ణారెడ్డి, ఈసీ మెంబర్లు మంత్రి విశ్వనాథ్ రెడ్డి, కల్లూరు నాగరత్నారెడ్డి, చంద్రమౌళి రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ బాబుల్ రెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్, ఆటో డ్రైవర్ ఘర్షణ

గార్లదిన్నె: మండల కేంద్రంలోని రైల్వే గేట్ వద్ద ఆదివారం ఆర్టీసీ బస్సు డ్రైవర్, ఆటో డ్రైవర్ ఘర్షణ పడిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు.. గార్లదిన్నె ఇందిరమ్మ కాలనీకి చెందిన వరదరాజులునాయక్ ఆటో నడుపుకుంటూ రైల్వే గేట్ సమీపంలోకి రాగానే.. గేట్ వేయడంతో అతడు ఆటో రోడ్డుపై నిలిపాడు. అదే సమయంలో పెనకచెర్ల డ్యాం నుంచి అనంతపురం వస్తున్న ఆర్టీసీ డ్రైవర్ మహబూబ్‌పీరా ఆటో పక్కనే బస్సును ముందుకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఆటో డ్రైవర్ వరదరాజులు బస్సు డోర్ పగలగొట్టి డ్రైవర్‌తో గొడవ పడ్డాడు. ఇద్దరూ వాగ్వాదం చేసుకున్నారు. ఆర్టీసీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు.

ఇండోర్ స్టేడియం అధ్యక్షుడిగా జి.శ్రీనివాసులు



నూతనంగా ఎంపికైన అధ్యక్ష, కార్యదర్శులకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం: అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియం అధ్యక్షుడిగా జి.శ్రీనివాసులు (ఎస్.వై.కే ప్రోగ్రాం ఇన్‌చార్జ్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా డాక్టర్ ఎం.సుబ్బారావు (పీవీకేకే ప్రిన్సిపాల్) నియమితులయ్యారు. ఆదివారం ఇండోర్ స్టేడియంలో రైపర్ కళాశాల కరస్పాండెంట్ రవీంద్ర రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండోర్ స్టేడియం అధ్యక్షుడిగా ఎంపికైన జి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. క్రీడలు శారీరక ఉల్లాసంతో పాటు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయన్నారు. ఇండోర్ స్టేడియంలో చాలా సమస్యలు గతంలో ఉన్నప్పటికీ, కమిటీ సభ్యులు పరిష్కరించారు. చిన్న సమస్యలు ఉన్నా వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యదర్శి డాక్టర్ ఎం. సుబ్బారావు మాట్లాడుతూ.. సమస్యలను ప్రజాప్రతినిధులకు తెలియజేసి ఇండోర్ స్టేడియం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

సత్యసాయి భక్తుల పాదయాత్ర



కనుముక్కల ఉన్నత పాఠశాలకు చేరిన మహారాష్ట్రకు చెందిన శ్రీసత్యసాయి భక్తులు

చెన్నేకొత్తపల్లి: మహారాష్ట్రకు చెందిన సత్యసాయి బాబా భక్తులు చేపట్టిన పాదయాత్ర ఆదివారం సాయంత్రం మండలంలోని కనుముక్కల గ్రామానికి చేరుకుంది. ధర్మవరం రైల్వే స్టేషన్ నుంచి పుట్టపర్తికి దాదాపు 1,200 మంది సాయి భక్తులు పాదయాత్రగా బయలుదేరారు. మార్గమధ్యంలో కనుముక్కల గ్రామానికి చేరుకున్న వీరు రాత్రి స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బస చేశారు. అనంతరం అక్కడే శ్రీసత్యసాయి బాబా భజనలు చేశారు. పలువురు భక్తులు మాట్లాడుతూ.. ఏటా ఆషాఢ మాసంలో వచ్చే తొలి ఏకాదశి పండుగ రోజున శ్రీసత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకుంటామన్నారు. ప్రతి ఏడాది పుట్టపర్తికి వస్తామన్నారు. శ్రీసత్యసాయి భజనలు వినేందుకు గ్రామస్తులు పెద్ద ఎత్తున ఉన్నత పాఠశాలకు తరలివచ్చారు.

గంగమ్మ తల్లీ.. వర్షాలు కురిపించు

'గంగమ్మ తల్లీ.. కరుణించి వర్షాలు సమృద్ధిగా కురిపించు' అంటూ భక్తులు వేడుకున్నారు. గంగపుత్రుల కులదైవమైన గంగమ్మ తల్లి బోనాల జాతర ఆదివారం సందడిగా సాగింది. స్థానిక ఆదర్శ నగర్‌లోని అమ్మవారి ఆలయం వద్దకు జిల్లా వ్యాప్తంగా వందలాదిగా గంగపుత్రులు తరలివచ్చారు. మహిళలు భక్తిగీతాలు ఆలపిస్తూ, అమ్మవారిని స్తుతిస్తూ తలపై బోనాలను పెట్టుకుని ఊరేగింపు నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గాలం రామకృష్ణ, కార్యదర్శి చెరుకు శ్రీనివాసులు మాట్లాడారు. ఏటా ఆషాఢమాసంలో పంటలు పండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుంటూ ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి బోనం సమర్పించే వేడుక ప్రాచీనకాలం నుంచి వస్తోందన్నారు. అనంతరం ఆలయంలో కొలువైన గంగమ్మ, పోలేరమ్మ దేవతామూర్తులకు అభిషేకాలు, కుంకుమార్చనలు, మహా నైవేద్య సమర్పణ జరిగాయి. అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వెంకట రమణయ్య, ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

– అనంతపురం కల్చరల్:



డప్పుచప్పుళ్ల మధ్య గంగమ్మ దేవతకు బోనాలు తీసుకెళ్తున్న దృశ్యం



అలంకరణలో గంగమ్మ దేవత



అమ్మవారి ప్రతిమతో యువతి



బోనం ఎత్తుకున్న మహిళలు

ఆకట్టుకున్న ఆ పాత మధురాలు



పాటలు పాడుతున్న పాలసముద్రం నాగరాజు బృందం

అనంతపురం కల్చరల్: అమరగాయకుడు ఘంటసాల ఆలపించిన ఆ పాత మధురాలతో జిల్లా గాయనీ గాయకులు శ్రోతలను మంత్ర ముగ్ధులను చేశారు. అనంత ఘంటసాల ఆరాధన సమితి వ్యవస్థాపకుడు, సీనియర్ గాయకుడు పాలసముద్రం నాగరాజు ఆధ్వర్యంలో మూడవ రోడ్డులోని ఘంటసాల భవన్‌లో ఆదివారం సంగీత సత్సంగం జరిగింది. అధిక సంఖ్యలో విచ్చేసిన గాయనీ గాయకులు ప్రేక్షకులను ఆ పాత మధురాలతో ఆకట్టుకున్నారు. విషాద గీతాలు, యుగళగీతాలు, సంకీర్తనలు ఆలపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆచార్య సుధాకర బాబు, శ్రీదేవి, లక్ష్మీనారాయణ, బృంద, పద్మ, రవి, పగడాల లక్ష్మి తదితరులు ఆలపించిన పాత పాటలు అలరించాయి. ముఖ్యంగా వందేమాతరం.. ఊహలు గుసగుసలాడే వంటి పాటలకు చిన్నారి నిఖిత కో బోర్డు వాయించి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గాయనీ గాయకులు పాలసముద్రం నాగరాజు సంగీత రంగంలో చేస్తున్న కృషిని అభినందిస్తూ సత్కరించారు. ఔత్సాహికులైన గాయకులను ప్రోత్సహించడం, కళాభిమానులకు కూడా ఉచిత భోజన వసతి కల్పించడం అందరికీ సాధ్యం కాదని కొనియాడారు.

21న గోదావరి కవితోత్సవం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర నాయకులు

అనంతపురం కల్చరల్: ఈనెల 21 పిఠాపురం వేదికగా సాగే గోదావరి కవితోత్సవం పోస్టర్లను ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నగరానికి విచ్చేసిన సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు గుత్తాహరిసర్వోత్తమ నాయుడు, రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ రమేష్ నారాయణ, శ్రీశ్రీ కళావేదిక యువజన విభాగం ప్రధాన కార్యదర్శి వడ్డే సుధాకర్ మాట్లాడారు. పిఠాపురంలో జరుగనున్న కవితోత్సవంలో అనంత వాసులకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వనున్నట్లు తెలిపారు. గుర్రం జాషువా అవార్డు గ్రహీత డాక్టర్ కత్తిమండ ప్రతాప్ స్ఫూర్తిదాయక నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఔత్సాహిక కవులు, రచయితలను ప్రోత్సహిస్తుండటం అభినందనీయమన్నారు. శ్రీశ్రీ కళావేదిక 5 వేల మంది సభ్యులతో ఇప్పటి వరకు 40 పుస్తకాలను ముద్రించిందన్నారు. యువతను ప్రోత్సహించడమే లక్ష్యంగా మరోసారి పెద్ద ఎత్తున కవితోత్సవం నిర్వహిస్తున్నారని వెల్లడించారు. అనంత కవులు విరివిగా పాల్గొని కవితాగానం చేయాలని కోరారు. కవుల వద్ద ఎటువంటి రుసుము వసూలు చేయకుండా చక్కటి భోజన వసతి కూడా కల్పిస్తున్న కవితోత్సవాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక యూనివర్సిటీల కన్వీనర్ డాక్టర్ బత్తల అశోక్, సీనియర్ కవి టీవీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

17న ద్విచక్ర వాహనాల వేలం

చెన్నేకొత్తపల్లి: స్థానిక సెబ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలను ఈనెల 17వ తేదీన ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ లలితా దేవి, ఎస్ఐ శివప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సెబ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగే బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు డిపాజిట్ చెల్లించి పాల్గొలన్నారు. వాహనాలు కొనదలచిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

సంతల ఆదాయం రూ.3.49 లక్షలు

అనంతపురం సెంట్రల్: స్థానిక మార్కెట్ యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.49 లక్షల ఆదాయం వచ్చినట్లు సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ. 2,16,770, ఆదివారం జరిగిన పశువుల సంత నుంచి రూ.1,32,700 ఆదాయం వచ్చిందన్నారు.

మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న ఏపీ విద్యుత్ మీటర్ రీడర్ల సంఘం ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు రాజారెడ్డి

అనంతపురం అర్బన్: 'విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటుసమస్యలను తక్షణం పరిష్కరించాలని ఏపీ విద్యుత్ మీటర్ రీడర్ల సంఘం ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాజారెడ్డితో పాటు సంఘం రాష్ట్ర కోశాధికారి రమేష్ బాబు, ఏపీఎస్పీడీసీఎల్ వర్కింగ్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, నగర అధ్యక్షుడు కృష్ణుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోయే అవకాశం ఉంటుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత, ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని ప్రభుత్వాన్ని, యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కాంట్రాక్టర్లు మీటర్ రీడర్లకు గౌరవవేతనాన్ని అగ్రిమెంట్‌లో ఉన్నదాని కంటే తక్కువగా ఇస్తూ అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ మొత్తాన్ని సక్రమంగా జమ చేయడం లేదన్నారు. మీటర్ రీడర్ల సమస్యలను ప్రభుత్వం, అధికారులు పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

నూతన కమిటీ ఎన్నిక..

ఏపీ విద్యుత్ మీటర్ రీడర్ల సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా రాజారెడ్డి, సలహాదారుడిగా రాజేష్ గౌడ్, అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా రామును ఎన్నుకున్నారు. అదే విధంగా కోశాధికారిగా దస్తగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షేక్ షాన్వాజ్, సంయుక్త కార్యదర్శిగా సలీమ్‌తో పాటు 23 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.

భక్తిశ్రద్ధలతో చిన్న సరిగెత్తు



పానకాల కుండలను తీసుకొచ్చిన భక్తులు



వన్నూర్‌స్వామి పీరును ఊరేగిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండల కేంద్రంలో మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారం చిన్న సరిగెత్తు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్ల స్వాములకు ప్రత్యేకంగా వెండి గొడుగులు అలంకరించారు. భక్తులు డప్పుచప్పుళ్ల మధ్య పానకాల కుండలను తీసుకొచ్చి పీర్ల స్వాములకు చదివింపులు చేయించారు. మొక్కుబడి ఉన్న భక్తులు పెద్ద పెద్ద పూలమాలలను పీర్ల స్వాములకు వేశారు.

ఘనంగా వన్నూర్‌స్వామి గ్రామోత్సవం

చిన్న సరిగెత్తు కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరులో సాయంత్రం వన్నూర్‌స్వామి పీరును గ్రామంలో ఊరేగించారు. పూలహారాలు వేసిన వన్నూర్‌స్వామి పీరును ఆత్మకూరు పీర్ల మసీదు నుంచి అంకాలమ్మ ఆలయం వద్దకు.. అక్కడి నుంచి ఆత్మకూరు బొడ్రాయి వరకూ గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు దారి పొడవునా స్వామికి చక్కెర చదివింపులు చేయించారు. ఈనెల 16న పెద్ద సరిగెత్తు ,17న జలధి కార్యక్రమం ఉంటుందని గ్రామ పెద్దలు, ముల్లా సాహెబ్‌లు తెలిపారు.

కల్యాణ మండపం నిర్మించుకుందాం

అనంతపురం ఎడ్యుకేషన్: ఎంతో కాలంగా గాండ్ల, తెలిక కులస్తులు ఎదురుచూస్తున్న కల్యాణ మండపం నిర్మాణ కలను సాకారం చేసుకోవడానికి శక్తి వంచన అందరూ కలిసికట్టుగా కృషి చేద్దామని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గుత్తి రోడ్డులోని సంఘం కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడు పెరవలి రాము అధ్యక్షతన జరిగిన సమావేశానికి కార్యనిర్వాహక అధ్యక్షులు సుభాష్ చంద్రబోస్, గౌరవ అధ్యక్షులు చింతకుంట రామయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట రాముడు, మహిళా నాయకురాలు విశాలాక్షి, విజయ భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు గార్లదిన్నె నాగరాజు, మేడాపురం లక్ష్మయ్య హాజరయ్యారు. పేద విద్యార్థుల చదువుకు సహాయ సహకారాలు అందిద్దామని నాయకులు కోరారు.సమావేశంలో సంఘం కోశాధికారి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు కె.పురుషోత్తమ కుమార్, రత్నమయ్య, సీనియర్ నాయకులు చలపతి, బచ్చు చలపతి, మహిళా నాయకురాలు రామ సుబ్బులు, న్యాయవాది పెరవలి శరత్ బాబు, గాండ్ల రవి, రామాంజనేయులు, రిటైర్డ్ కండక్టర్ ప్రసాద్, గాండ్లవారిపల్లి సంజీవ్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరా పాహిమాం



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొలుత స్వామికి పట్టు వస్త్రాలతో పాటు బంగారు ఆభరణాలను అలంకరించారు. అనంతరం ఆకుపూజతో పాటు విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కాల సర్పదోష నివారణ హోమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. అదేవిధంగా ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతి దేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

అనధికార హోర్డింగ్స్‌ను పట్టించుకోరా?

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారుల బాధ్యతారాహిత్యం వ్యాపారులకు వరంగా మారింది. నగరంలో ఇష్టానుసారంగా అడ్వైటైజ్‌మెంట్ బోర్డులు వేసుకుంటున్నా.. అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో నగరపాలక సంస్థ ఆదాయానికి గండి పడుతోంది. టీడీపీ అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే నగరంలో ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారికంగా అడ్వైటైజ్‌మెంట్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల నగరంలోని శ్రీకంఠం సర్కిల్, కొత్తూరు నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్ పై భాగంలో భారీ హోర్డింగ్ ఏర్పాటు చేశారు. కానీ అధికారులు అటువైపు తొంగి చూడలేదు. అధికారులకు తెలిసే కొందరు హోర్డింగ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా కమిషనర్ మేఘ స్వరూప్ చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ వర్గాలు కోరుతున్నాయి.

బాలికపై అత్యాచారయత్నం

నార్పల: బాలికపై ఓ కామాంధుడు అత్యాచార యత్నానికి పాల్పడిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన నాగరాజు ఇంట్లో జిరాక్స్ మిషన్ పెట్టుకుని జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో జిరాక్స్ చేయించుకునేందుకు వచ్చిన ఓ బాలికపై అతడు అత్యాచారానికి యత్నించాడు. అతడి బారినుంచి తప్పించుకున్న బాలిక ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు తెలపడంతో.. వారు వచ్చి కామాంధుడికి దేహశుద్ధి చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

దాతలూ.. ముందుకు రండి

- షిర్డీ సాయినాథుడి మందిరం నిర్మాణానికి శ్రీకారం చుట్టిన ఎస్కేయూ సిబ్బంది
- ఒడిదుడుకుల మధ్య కొనసాగుతున్న పనులు
- విరాళాల కోసం ఎదురుచూపులు




ఎస్కేయూ సమీపంలో నిర్మాణంలో ఉన్న సాయిబాబా మందిరం

అనంతపురం/కల్చరల్: అజ్ఞానమనే అంధకారాన్ని పారద్రోలి భక్తుల్లో జ్ఞానజ్యోతులు వెలిగించిన షిర్డీ సాయిబాబా అపర దత్తావతారమేనని సాయినాథుడి భక్తులు గాఢంగా విశ్వసిస్తారు. ప్రస్తుత సమాజంలో ప్రతి వీధిలో బాబా సుందర రూపం సాక్షాత్కరిరచి పూజలందుకుంటోంది. కుల, మతాలకు అతీతం అనే భావనను ప్రచారం చేసి సూఫీవేదాంత తత్వవేత్తగా సాయినాథుడు ప్రతి ఇంట పిలిస్తే పలికే దైవంగా మారాడు. పట్టణాల్లోనే కాకుండా మారుమూల పల్లెల్లోనూ బాబా మందిరాలు వెలుస్తున్నాయి. ఎస్కే యూనివర్సిటీ సమీపంలో సర్వాంగ సుందరంగా మరో మందిరం నిర్మాణమవుతోంది. దీని ప్రచారంలో ప్రధాన బాధ్యత తీసుకున్నది దాదాపు యూనివర్సిటీ ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది కావడం విశేషం.

ఇరవై ఏళ్ల కిందటే శ్రీకారం

ఎస్కే యూనివర్సిటీ పరిసరాలు ప్రస్తుతమైతే అత్యంత బిజీగా ఉండే ప్రధాన కూడళ్లలో ముందు వరసలో ఉంటాయి. అయితే రెండు దశాబ్దాల కిందట ఓ మోస్తరుగా మాత్రమే జన సంచారమున్న రోజుల్లోనే షిర్డీ సాయిబాబా ఆలయం ఉండాలని కొందరు యూనివర్సిటీ ఉద్యోగులు భావించారు. మారుతీనగర్‌లో మందిరం ఏర్పాటుకు సంకల్పించి పునాది వేశారు. అనేక ఒడిదుడుకుల నడుమ మందిర నిర్మాణం కొనసాగుతోంది. 2002లో స్థలం కొన్నా 2014కు కానీ తొలిపునాది రాయి పడలేదు. దివంగత ఆచార్య పీఎల్ శ్రీనివాసరెడ్డి చైర్మన్‌గా, వీరారెడ్డి వైస్ చైర్మన్‌గా, మాజీ రిజిస్ట్రార్ ఏవీ రమణ ప్రధాన కార్యదర్శిగా, సూర్యనారాయణ, రంగప్ప తదితర ఇతర ఆచార్యులు, బోధనేతర సిబ్బంది కార్యనిర్వాహకులుగా ముందుండి నడిపించడంతో నిర్మాణం సాగుతోంది. గురుపౌర్ణమి నాటికి పూర్తి చేయాలని సంకల్పించినా భక్తుల సహకారం కావాలని నిర్వాహకులంటున్నారు.


మానసిక ప్రశాంతత కోసమే నిర్మాణం



ఆధ్యాత్మికత ఎవరికైనా మానసిక ప్రశాంతత, ఉల్లాసాన్ని అందిస్తుంది. ఆ క్రమంలో అందరూ అనిర్వచనీయమైన అనుభూతిని పొందాలన్న లక్ష్యంతో బాబా మందిర నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. మనిషి కర్తవ్యం సేవలందించే వరకే ఆ పైన అన్ని సాయినాథుడే చూసుకుంటాడు. వచ్చే గురుపౌర్ణమికి మందిరం పూర్తి చేయాలని సంకల్పించాం. మందిరం పూర్తయి.. ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థులకు భోజన వసతి కల్పిస్తే పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి మందిరం ఉపయోగపడాలన్నది మా ఆకాంక్ష.

– ఎం.వీ.రమణ, విశ్రాంత రిజిస్ట్రార్, ఎస్కేయూ

సహకారం అవసరం



ఆ రోజుల్లో రూ.60 లక్షలతో ఒక సుందర నిర్మాణం చేయాలని అనుకున్నాం. కానీ రెండు పదుల కాలం దాటిపోవడంతో ప్రస్తుతం అంచనా వ్యయం రూ.కోటి దాటిపోయింది. యూనివర్సిటీలో తప్ప మేము ఎవరినీ విరాళాలు అడిగింది లేదు. ఇకపై అందరి సహకారం ఉంటే మరో బాబా మందిరం మారుతీపురం కాలనీ వాసులందరి ముంగిటకు వస్తుంది. ఈ గురుపౌర్ణమి నుంచి ప్రతి గురువారం, ఆపై నిత్యాన్నదానం చేయాలని అనుకుంటున్నాం. బాబా భక్తులు సేవకు తరలిరావాలని విజ్ఞప్తి.

– వీరారెడ్డి, బాబా మందిరం ఉపాధ్యక్షుడు

నేడు మండల సర్వసభ్య సమావేశం

రాప్తాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గీతావాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులందరూ హాజరు కావాలన్నారు. మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా రావాలని ఆదేశించారు. సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

85 మందికి వైద్య పరీక్షలు

రాప్తాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం 85 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు ఉచితంగా మందులు అందజేశారు. ప్రజలు అనారోగ్యానికి గురైతే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాలన్నారు. ఇక్కడ నాణ్యమైన వైద్యం అందిస్తామన్నారు.